

# మాలతి

## కృష్ణమూర్తిపట్నాయక్

రావిచెట్టుమీద అల్లుకున్న మాలతీలత విరబూసి మధుర సుగంధాన్ని వెదజల్లుతూఉంది. తెల్లన ముత్యాల్లా, అందమైన ఆడదాని పళ్ళలా మాలతీ పువ్వులు చాలా అందంగా ఉన్నాయి. వాటినుంచి వెలువడే మధుర సుగంధం మైమరపింపజేస్తూఉంది. ఎత్తుగా పెరిగిన రావిచెట్టుకి వత్తుగా అల్లుకుని ప్రాకి పెనవేసుకున్న ఆ మాలతీలత ప్రియుని కౌగిటనున్న ప్రియురాలిలా కనబడుతూ ఉంది. ప్రియుడూ, ప్రియురాలిలా తలపింపజేసే ఆ రావినీ, ఆమాలతీలతనీ చూస్తుంటే గడచిపోయిన మధురస్మృతులు స్మృతీపథంలో దొర్లిపోసాగాయి,

ఒకనాడు వరండాలో కూచుని ఒక నవల చదువుకుంటూన్నాను. సూర్యుడు అస్తమిస్తూన్నాడు. చల్లనిగాలి వీస్తూఉంది. హఠాత్తుగ నా ఎదుట గాజుల గలగలలు వినబడ్డాయి. తలెత్తిచూశాను. ఒక పదహారేళ్ళ అమ్మాయి నా ఎదుట నిలుచుని చిన్నగా నవ్వుతూ ఉంది.

చామనచాయ. దంపులుదేరిన అవయవాలు. పెద్ద పెద్ద కాళ్ళు. నిలుచుని నావైపు చూస్తూ ఉంది.

'ఎవరు? మాణిక్యమా!' పోల్చి ఆశ్చర్యంతో అన్నాను.

'అవునండీ! నన్ను మరచిపోయారా వేణు గారూ!' అంది మాణిక్యం వ్యంగంగా.

'చాలా మారిపోయావు! చేయితిరిగిన శిల్పి చెక్కిన శిల్పంలా...!'

'ఇంకా ఆ శిల్పాలూ, బొమ్మలూ మీలో రానురానూ ఎక్కువవుతున్నా యే!'

'ఇంకా నీ చిలిపితనం పోలేదే!'

'మాణిక్యం మా ఎదుటింటి వాళ్ల అమ్మాయి. నిజంగా మాణిక్యమే! తండ్రి లేడు. తల్లీ చిన్నతమ్ముడూ ఉన్నారు. ఉన్న చిన్న యింట్లో ఒకభాగం అద్దెకిచ్చి ఆ వచ్చిన అద్దెతో పైఖర్చులు గడుపుతూ, చిన్న పొలం మీదవచ్చిన చాలీ చాలని గింజలతో ఎలాగో కాలం గడుపుకొస్తున్నారు. ఆమెకి చదువుకో వాలనిఉంది కాని, సొమ్ము లేక స్కూలు ఫైనలువరకు చదివి మానేసింది. ఒక ఏడాది తాతగారి ఇంట్లోఉండి ఉదయానే వచ్చింది. వచ్చినప్పటినుంచి నన్ను చూడాలని ఉబలాట పడుతూ ఉందిట!

మాణిక్యం నాదగ్గరికి అప్పుడప్పుడు వస్తూ చదువుకుంటూ ఉండేది. నాదగ్గిర పుస్తకాలూ, నవలలూ, పత్రికలూ తీసుకెళ్ళి చదువుకుంటూ ఉండేది.

ఒకరోజు, 'వేణూ! ఈ ప్రపంచంలో గొప్ప వాళ్ళూ, బీదవాళ్ళూ అనే భేదం ఎందుకు ఉంటోంది?' అడిగింది మాణిక్యం.

'అదంతా స్వార్థపరులు చేసిన మోసం! స్వార్థంతో, మోసంతో కొందరు నరరూప రాక్షసులుతోటి మానవుల్ని పీల్చివేసే ఫలి తం!' అన్నాను నేను.

'మరి జాతులూ, నీతులూ?'

'అవికూడా అంతే! స్వార్థపరులూ, సంకు చితబుద్ధి గలవారూ కల్పించిన సంకెళ్లు అవి! మనుషులంతా ఒకటేను!'

మాణిక్యం నావైపు తదేక దీక్షతో చూడ సాగింది. విశాలమైన పెద్ద కళ్లల్లో ఏవో ఆశా జ్యోతులు వెలగడం నాకు కనిపించింది.

'అయితే నువ్వు వీటిని లెక్కపెట్టవా?' మెల్లిగా అడిగింది.

'లేదు. ఎంతమాత్రం లెక్క పెట్టను!' గట్టిగా అన్నాను నేను.

మాణిక్యం ముఖం వికసించింది. కిలకిలా నవ్వింది.

'మాణిక్యం! ఒకమాట చెప్తా. వింటావా?' అన్నాను ఒకరోజు నేను.

'ఏమిటి?'

'మాణిక్యం అన్న పేరు మార్చుకుని ఇంకో పేరు పెట్టుకోరాదూ?'

'ఏం నాపేరు బాగా లేదూ?'

'బాగుంది. కాని, అంతకన్నా మంచిది మరో పేరుంది.'

'ఏమిటది?'

'మాలతి! చూడు ఆ రావిచెట్టుకి అల్లుకున్న మాలతీ లత ఎలా ఉందో! ఆ మాలతీ పువ్వులు ఎంత అందంగా ఉన్నాయో! ఈనాటినుంచి నీపేరు మాలతి. నీవు నా మాల...!'

మాలతి తల వంచుకుని సిగ్గుపడి పారిపో యింది.

తరవాత కాలేజీ తెరవగానే నేను పట్నం వెళ్ళిపోయాను. మాలతి ఉత్తరాలు రాస్తూం డేది. అన్నిటికీ జవాబు రాయాలని ఉండేది. కాని, ఎలా రాయడం? పట్టుబడిపోతేనో.'

ఎమ్. ఏ. పరీక్షకు కూచుని ఇంటికి వచ్చాను. పేపర్లన్నీ బాగానే రాశాను. క్లాసు వస్తుందని




మధు:- ఒరే రామూ! నా నానగారు నాకు దీపావళి పండుగకు క్రొత్త బట్టలు చాలా తెచ్చారు నీకు తెలుసా?

రాజు:- ఒరే మధు:- మీ నానగారు నీకు తెచ్చిన క్రొత్త బట్టలు ఎన్ని రకములో నాకు చూపవూ? నేనున్నూ కొనుక్కొంటా?

మధు:- నాకు మా నాన్నగారు కాండో బనీన్లు, డ్రాయర్లు, అబ్బో ఎన్నో తెచ్చారు. యివి చూడు.

పిల్లలకు, పెద్ద వారికి అనేక సయిజులలో బనీన్లు, డ్రాయర్లు, ఆడవారి బాడీలు, తయారుచేయువారు
రాజగోపాల్ నిట్టింగ్ కంపెనీ:—
తిరుపూరు.

• 'దీపావళి' పండుగకు సరి క్రొత్త రకములు 'మెరీనా బ్యూటి' యింటర్ లాక్ బనియన్లు ప్లయిన్ 5000 బనియన్లు తయారు చేయబడినవి.

దొరకు చోటు:—
రాజగోపాల్ బనియన్ స్టోర్సు. 90. గిడ్డంగి వీధి, మద్రాసు -1
స్టాకిస్టు, అండ్ ఏజంట్సు:—
శ్రీ బాలాజీ బనియన్సు, (హోల్ సేల్ మర్చంట్సు,) విజయవాడ (ఆంధ్రప్రదేశ్,)

ధైర్యంగా ఉంది. మాలతి మళ్ళా కనిపించింది. కాని, ఎందుకో మునపటిలా లేక సిగ్గుపడుతూ ఉంది. ఎందుకో బెదురుతూ ఉంది. నాకు మాలతిలోనూ, నాలోనూ చాలా భేదం కనిపించింది. నా అంతస్థు ఎంతో గొప్పదని తోచింది.

అంతే! నాది చేసుకోదలచిన మాలతిని నాది చేసుకోలేక పరులకు అప్పగించాను. మాలతి పెళ్ళి ఇంకొకరితో జరిగిపోయింది! మాలతి పరాయిదాయి అయిపోయింది!

'దీనికి కారణం ఏమిటి? మాలతి నాజాతి పిల్ల కాదు! ఆస్తిపరురాలు కాదు! అంతర్వర్ణ వివాహానికి ముందంజ వేయడం నాచేత కాదు. మన పెద్దలు కానివ్వనూ లేదు. ఓహో!...

నేను ప్రొఫెసర్‌గా ఉద్యోగంలో చేరాను. సుజాతి యువతిని పెళ్ళి చేసుకున్నాను. కులమింటి తైనా మంచిదట! మాలతిని పూర్తిగా మరిచిపోయాను!

నాకు పిల్లలుకూడా కలిగారు. పెరిగి పెద్దవాళ్ళయ్యారు. పెద్దకొడుకు మధు మరో ఊర్లో

హాస్టల్లో ఉండి. ఎమ్. ఎస్. సి. చదువుతూ న్నాడు.

ఒకమారు సెలవులకి మధు ఇంటికివచ్చాడు. మాటల సందర్భంలో మన పెద్దల్నీ, మన సంఘాన్ని విమర్శించాడు. జాతులనే సంకెళ్లు తెగగొట్టేయాలన్నాడు. ప్రేమ వివాహాలని సమర్థించాడు.

సిద్ధాంతరీత్యా నేను వాడితో ఏకీభవించాను. కాని, లోకరీతిని ఒకమారు వాడికి చెప్పాను. సంఘాన్ని ఎదిరించడం, వదులుకోని ఎండగా ఉండడం చాలా కష్టం అన్నాను.

'నాన్నా! నువ్వు ఒక సిద్ధాంతాన్ని సమర్థిస్తూనే దానికి ఎండగా ఉంటావెందుకు?' ప్రశ్నించాడు మధు.

'మాటలకీ, చేతలకీ చాలా వ్యత్యాసం ఉంది.'

'ఎందుకుండాలి?'

'అది మనుషుల బలహీనతని పోగొట్టుకోవడం చాల కష్టం!'

రెండేళ్లు దొర్లిపోయాయి.

ఒకరోజు మధు ఒక యువతిని ఇంటికి తీసుకొచ్చాడు. నేను వరాండాలో కుర్చీలో కూచుని ఉన్నాను. వస్తూనే మధు నా కాళ్ళను తాకి దండం పెట్టాడు. ఆ యువతికూడా అలానే చేసింది. ఇంట్లోకి వెళ్ళి ఇద్దరూ నా భార్యనుకూడా అలానే దండం పెట్టారు. ఇంట్లో అందరం ఆశ్చర్యపోయాము.

'నాన్నా! మమ్మల్ని ఆశీర్వదించు. ఇది మీ కోడలు!' అన్నాడు మధు.

నా తలమీద పిడుగుపడ్డట్టు అయింది! ఏదో స్వప్నంలో ఉన్నట్టు అనిపించింది! కాని, నా నోటివెంట అనుకోకుండా వెలువడింది–'సుఖంగా ఉండండి!'

అ యువతి అందంగా ఉంది. విశాలమైన మెరిసేకళ్లు. చక్కని ముక్కు, పల్లుతీరు.

'ఎవరమ్మాయి ఈమె?' అనడిగాను మధుని.


గమనింపుడు! గమనింపుడు !!



మీ మేలు కొరకు గమనింపుడు !!!

మీకు అకలి లేకున్నను, జీర్ణశక్తి లేకున్నను, ఎముకలు మాత్రము తెలియుచుండునట్లు శరీరము కృషించియుండినను, కన్నులు గుంటలు పడినను, జ్ఞాపకశక్తి కొంచమైనను లేకుండినను, మలబద్ధముచేత బాధపడుచుండినను ధైర్యము, చురుకుదనము లేకుండినను, శుక్లము బొత్తిగా లేకుండినను, మేహరోగముచేత పీడింపబడి యుండినను, మాయొక్క "ఆనంద కుసుమాకర లేహ్యము"ను తెప్పించి పుచ్చుకొందురేని 6 వారములలోగా ఎటువంటి మహావ్యాధులనుండి తప్పించుకొని సౌఖ్యము పొందగలరు.

డబ్బి 1-కి రూ. 3-00.

మలయాళి మెడికల్ హాల్, (రిజిస్టర్డు) పి.బి. నెం. 27-189, వక్కీల్ (కొత్తవీధి, మదురై)

'నా క్లాసుమేటు. మా హాస్టల్లో ఉండి చదువు కుంది. గర్నమెంటు స్కాలర్‌షిప్పు దొరికింది. మా మనసులు కలిశాయి. పెళ్ళిచేసుకుని వచ్చాము.'

'నాకెందుకీవిషయం చెప్పలేదు.? అన్నాను నేను.

'ఈమె తల్లిదండ్రులెవరు? ఎక్కడున్నారు?' అడిగింది మా ఆవిడ.

అదివిని ఆ యువతి తలవంచుకుంది. ముఖం జేవురించింది. మధు మాట్లాడలేదు. కొంచెం సేపు పోయాక-'మా జాతివాళ్లుకారు నాన్నా! నన్ను క్షమించు!' అన్నాడు మధు.

'శివశివా! ఎంతదారుణం ఎంతదారుణం!' చెవులు మూసుకుని గట్టిగా అన్నది మా ఆవిడ.

'అమ్మాయి తల్లిదండ్రులెవరు?' అడిగాను నేను.

'అమ్మాయికి తండ్రిలేడు. కొంతకాలం కిందట చనిపోయాడు. తల్లి ఉంది. మిస్ట్రెస్‌గా పనిచేస్తూ ఉంది. పేరు మాలతి.

'మాలతీ! ఎవరీ మాలతి? కొత్తపేట వాళ్ళా?'

'అవును.'

అవును! ఓహో! మాణిక్యం!...కాదు, మాలతి! నేమ ముద్దుగా పేరుపెట్టిన మాలతి కుమార్తె ఈ పిల్ల! నేను చేయలేనిపని నా కొడుకు చేశాడు!

కాని...కాని...

కొడుకునీ, కోడల్ని మా ఇంట్లో ఉంచడం కుదరలేదు. ఇంకా తక్కిన పిల్లలున్నారు. వాళ్ళకి పెళ్ళిళ్లు అవ్వాలి. కులం చెడ్డవాళ్ళకి సంఘంలో స్థానం ఉండేరోజులు ఇంకా రాలేదు.

తరువాత ఇద్దరూ ఇంకోచోట ఇంకో ఊర్లో కాపురం పెట్టారు. మనసులు కలిసి, మమతలు పెరిగి మధురంగా బతకజూచే ఆ నవదంపతులకు సంఘం పెట్టే అడ్డంకులు ఇంకా ఎన్ని ఉన్నాయో!

ఈ బొమ్మను తలక్రిందులుగా చేసిచూడండి.



'కలికాలపు ముసలిది యౌవనవతిగా మారుచున్నది!

[చిత్రకారుడు] జి. మల్లేశరావు, బరంపురం.